E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 18-08-2025 (వారం) సోమవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




తెలంగాణకు మరోసారి రెడ్ అలర్ట్.. అత్యంత భారీ వర్షాలు » 3లో

ఆ రాష్ట్రంలో భారీగా బయటపడ్డ బంగారు నిక్షేపాలు » 4లో



బరువు తగ్గాను.. మళ్లీ కథలు వింటున్నా: కీర్తి సురేష్ » 5లో



తనే నా నిజమైన హీరో.. మేకప్ నచ్చదనడంతో ట్రోలింగ్ » 5లో



గంభీర్ ఇలాకా.. ఫిక్స్‌డ్ ఫినిషర్లు ఉండరు! » 6లో



# జీఎస్టీ సంస్కరణలకు సహకరించండి



- ప్రభుత్వ ఉద్యోగాలను అమ్ముకున్నారు కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన ప్రధాని ఢిల్లీలో హైవేలను ప్రారంభించిన మోదీ
- దీపావళికి ముందే జీఎస్టీ సంస్కరణలు రాష్ట్రాలు సహకరించాలని విజ్ఞప్తి తలపై పెట్టుకుని నాట్యం చేస్తున్న వారే.. అంబేడ్కర్‌కు ద్రోహం చేశారు
- ఢిల్లీలో పారిశుధ్య కార్మికులు గైర్హా జరైతే వారిని జైలుకు పంపే చట్టం తెచ్చారు



న్యూఢిల్లీ, ఈ కబురు: "రాజ్యాంగ ప్రతిని తలపై పెట్టుకుని నాట్యం చేస్తున్నామని చెప్పుకొనేవారే.. ఆ రాజ్యాంగాన్ని తొక్కేశారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ భావాలకు ద్రోహంచేశారు" అంటూ కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. గత ప్రభుత్వాలు.. రాజ్యాంగ స్ఫూర్తిని తక్కువ చేశాయని, సామాన్యులను అణిచివేసేలా శాశ్వత చట్టాలను తీసుకువచ్చాయని దుయ్యబట్టారు. దేశ రాజధాని ఢిల్లీలో రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధాని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మోదీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పై విమర్శల వర్షం కురిపించారు. "ఎవరైతే రాజ్యాంగాన్ని తలపై పెట్టుకుని నాట్యం చేస్తున్నామని చెప్పుకొన్నారో.. వారే దానిని తొక్కేశారు. బీఆర్ అంబేడ్కర్ భావాలు, ఆశయాలకు తీరని ద్రోహం చేశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం 1957లోని ఓ నిబంధనను ఆయన ప్రస్తావించారు. "ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ చట్టంలో అత్యంత ప్రమాదకరమైన నిబంధన చేర్చారు. ఎవరైనా పారిశుధ్య కార్మికులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా తమ విధులకు గైర్హాజరైతే నెల రోజులపాటు జైలుకు పంపేలా నిబంధన తెచ్చారు. సఫాయీ కర్మచారుల పట్ల వారి (కాంగ్రెస్) ఆలోచన ఎలా ఉందో ఒక్కసారి ఆలోచించండి.

తరువాయి 2లో



## వచ్చే నెలాఖరులో స్థానికం!

23న పీఏసీ సమావేశం... సీనియర్ నేతల అభిప్రాయాల సేకరణ

ఆ తరువాతే ఎన్నికలపై నిర్ణయం

తరువాయి 2లో

## ఈసీ'పై చర్యలకు వీల్లేకుండా చట్టం తెచ్చారు: రాహుల్ గాంధీ



» 2లో

## ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్

- మహారాష్ట్ర గవర్నర్ పేరును ఖరారు చేసిన బీజేపీ
- రాధాకృష్ణన్ తమిళనాడుకు చెందిన మాజీ ఎంపీ
- తెలంగాణ గవర్నర్‌గానూ కొన్నాళ్లు అదనపు బాధ్యతలు
- ఆరెస్సెస్‌తో సుదీర్ఘకాలంగా అనుబంధం
- వచ్చే ఏడాది తమిళనాడు శాసనసభ ఎన్నికలు
- వ్యూహాత్మకంగా ఎంపిక చేసిన కమలం పార్టీ
- ప్రతిపక్ష పార్టీలు కూడా మద్దతిస్తాయని అంచనా
- ఇండి కూటమిలోని డీఎంకే వ్యతిరేకించదనే యోచన
- తమ అభ్యర్థిపై నేడు నిర్ణయం తీసుకోనున్న విపక్షాలు!



తరువాయి 2లో

## 21న ఓయూలో హాస్టల్ భవనాలను.. ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

» ఉస్మానియా యూనివర్సిటీలో 1,200 మంది విద్యార్థులకు వసతి కల్పించే విధంగా రూ. 80 కోట్ల వ్యయంతో నిర్మించిన రెండు హాస్టల్ భవనాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

» ఆ హోదాలో ఓయూలో ప్రసంగించనున్న తొలిసీఎం

తరువాయి 2లో



## ఆధారాలైనా చూపండి.. క్షమాపణైనా చెప్పండి



» సంతకం చేసిన అఫిడవిట్ వారంలో సమర్పించండి

» లేదంటే మీ ఆరోపణలు నిరాధారమని భావిస్తాం

» మా భుజంపై తుపాకీ పెట్టి రాజకీయాలు చేయొద్దు

» 'జీరో హౌస్ నంబర్' కింద కొందరికి ఓటుహక్కు కల్పిస్తున్నాం

» వారిని నకిలీలంటే పేదల్ని అవమానించినట్లే

» రాహుల్ ఆరోపణల్ని ఖండించిన సీఈసీ జ్ఞానేశ్

ఈ కబురు, దిల్లీ: ఓట్ల చోరీ జరిగిందంటూ పదేపదే ఆరోపిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దానికి తగ్గ ఆధారాలనైనా సమర్పించాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని 'భారత ఎన్నికల సంఘం' (ఈసీఐ) డిమాండ్ చేసింది. ఆయన వద్ద ఆధారాలుంటే వారం రోజుల్లో ప్రమాణపత్రం రూపంలో సంతకంతో సమర్పించాలని అల్టిమేటం జారీచేసింది. అలా చేయనిపక్షంలో ఆరోపణల్ని నిరాధారంగా పరిగణిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ స్పష్టంచేశారు. ఈసీ భుజాన తుపాకీ పెట్టి ఓటర్లను లక్ష్యంగా చేసుకొని రాజకీయాలు చేసేవారి ఆటలు సాగవని తేల్చిచెప్పారు. ఎలాంటి ఆధారాల్లేకుండా ఓటర్లపై నకిలీలనే ముద్రవేసే ఎత్తులను తాము అంగీకరించబోమని స్పష్టంచేశారు. కర్ణాటకలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలోని ఓటర్లపై రాహుల్ ఫిర్యాదు చేసినందున వారంలోపు తప్పనిసరిగా ప్రమాణపత్రం దాఖలుచేసి, ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఓట్ల చోరీపై రాహుల్ ఆందోళన కార్యక్రమం మొదలుపెట్టిన నేపథ్యంలో జ్ఞానేశ్ ఆదివారం ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్‌సింగ్ సంధు, వివేక్‌జోషీతో కలిసి 85 నిమిషాలసేపు మీడియాతో మాట్లాడారు.

తరువాయి 2లో



## ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదు

» 2లో

## భారత్‌కు తిరిగొచ్చిన గగన యాత్రికుడు

» 2లో





## ఆ రెండూ వదులుకుంటేనే శాంతి

» 3లో

మొదటి పేజి తరువాయి

# జీఎస్టీ సంస్కరణలకు సహకరించండి



న్యూఢిల్లీ, ఈ కబురు: ''రాజ్యాంగ ప్రతిని తలపై పెట్టుకుని నాట్యం చేస్తున్నామని చెప్పుకొనేవారే.. ఆ రాజ్యాంగాన్ని తొక్కేశారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ భావాలకు ద్రోహంచేశారు'' అంటూ కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. గత ప్రభుత్వాలు.. రాజ్యాంగ స్ఫూర్తిని తక్కువ చేశాయని, సామాన్యులను అణిచివేసేలా శాశ్వత చట్టాలను తీసుకువచ్చాయని దుయ్యబట్టారు. దేశ రాజధాని ఢిల్లీలో రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధాని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మోదీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పై విమర్శల వర్షం కురిపించారు. ''ఎవరైతే రాజ్యాంగాన్ని తలపై పెట్టుకుని నాట్యం చేస్తున్నామని చెప్పుకొన్నారో.. వారే దానిని తొక్కేశారు. బీఆర్ అంబేడ్కర్ భావాలు, ఆశయాలకు తీరని ద్రోహం చేశారు'' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం 1957లోని ఓ నిబంధనను ఆయన ప్రస్తావించారు. ''ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ చట్టంలో అత్యంత ప్రమాదకరమైన నిబంధన చేర్చారు. ఎవరైనా పారిశుధ్య కార్మికులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా తమ విధులకు గైర్హాజరైతే నెల రోజులపాటు జైలుకు పంపేలా నిబంధన తెచ్చారు. సఫాయీ కర్మచారుల పట్ల వారి (కాంగ్రెస్) ఆలోచన ఎలా ఉందో ఒక్కసారి ఆలోచించండి. అత్యంత చిన్నతప్పుకే కార్మికులను జైల్లో పెట్టాలా? అలాంటి వారు ఇప్పుడు సామాజిక న్యాయం గురించి ఉపన్యాసాలు దంచికొడుతున్నారు. ఇలాంటి వికృత చట్టాలను తేవడం, అమలు చేయ డం వారికే సాధ్యం. అయితే ఇప్పుడున్నది మోదీ. అలాంటి అణిచివేత చట్టాలను గుర్తించి బుట్టదాఖలు చేస్తున్నాం'' అన్నారు. హరియాణాలోని గత కాంగ్రెస్ ప్రభుత్వంపైనా ప్రధాని విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ''హరియాణాలో కాంగ్రెస్ హయాంలో అవినీతి రాజ్యమేలింది. లంచాలు తీసుకోకుండా ఒక్క ప్రభుత్వ ఉద్యోగాన్నీ ఇవ్వలేదు. డబ్బులు, లేకపోతే సిఫారసులతో ఉద్యోగాలను అమ్ముకున్నారు. కానీ, ఇప్పుడు ఈ పరిస్థితి మీకెక్కడా కనిపించదు. సీఎం నాయబ్ సింగ్ సైనీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు ఇస్తోంది'' అని ప్రధాని అన్నారు.

**ఢిల్లీ ట్రాఫిక్ కష్టాలకు చెక్!**

ఢిల్లీలో రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్(యూఈఆర్)2లను ఆయన ప్రారంభించి జాతికి అంకితం చేశారు. సుమారు రూ.11వేల కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టులతో రాజధానివాసుల ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. అలాగే సోనిపట్, రోహ్‌తక్, బహదూర్‌గఢ్, గురుగ్రామ్‌ల నుంచి విమానాశ్రయానికి చేరుకునే సమయం తగ్గిపోనుంది. కాగా ఢిల్లీలో ఉత్పత్తయ్యే వ్యర్థాలను అర్థవంతం చేశామని, యూఈఆర్ రహదారి నిర్మాణంలో వినియోగించామని ప్రధాని చెప్పారు. రహదారుల నిర్మాణంలో పాలుపంచుకున్న కార్మికులు, ఇంజనీర్లతో మోదీ సంభాషించారు. అనంతరం, నూతన రహదారిపై ప్రధాని రోడ్ షో నిర్వహించారు. ఇదిలా ఉండగా జీఎస్టీ సంస్కరణలకు సంబంధించిన ముసాయిదాను రాష్ట్రాలకు పంపామని ప్రధాని మోదీ తెలిపారు. దీపావళికన్నా ముందే అమలు చేయనున్న ఈ సంస్కరణలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**ఇకపై పీఎంవో : సెంట్రల్ విస్టా!**
**వచ్చే నెలలో సౌత్ బ్లాక్ నుంచి తరలింపు**

కేంద్ర సెక్రటేరియట్‌లోని సౌత్ బ్లాక్‌లో 78 ఏళ్లకు పైగా ఉన్న ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) వచ్చే నెలలో సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్తగా నిర్మించిన కార్యనిర్వాహక భవన సముదాయానికి (ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్) తరలివెళ్లనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికార వర్గాలు వెల్లడించాయి. నూతన పీఎంవో కార్యాలయానికి ఒక కొత్త పేరు పెట్టనున్నారు. మూడోసారి అధికారం చేపట్టాక పీఎంవోను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. ప్రజాసేవకు పీఎం వో ఒక ప్రదేశంగా ఉండాలన్న వ్యాఖ్యల స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఆ పేరు ఉండనుందని తెలుస్తోంది.



మొదటి పేజి తరువాయి

## ఈసీ'పై చర్యలకు వీల్లేకుండా చట్టం తెచ్చారు: రాహుల్ గాంధీ



ఈ కబురు: బిహార్‌లో ఓట్ల చోరీకి 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' ఓ మార్గమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్నికల సంఘం పై ఎటువంటి చర్యలకు అవకాశం లేకుండా 2023లో కేంద్రం ఓ చట్టం తీసుకొచ్చిందని, ప్రధాని మోదీ అమిత్ షాలకు ఈసీ సాయం చేస్తున్నందునే ఇలా చేసిందని ఆరోపించారు. ఓటర్ల జాబితా అవకతవకల విషయంలో ప్రతిపక్షాల ఆరోపణలపై ఎన్నికల సంఘం మీడియా సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. ''ఈ రోజు ఎన్నికల సంఘం ఓ సమావేశం నిర్వహించింది. అయితే.. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సీసీ ఫుటేజీల విషయంలో ప్రభుత్వం చట్టాన్ని ఎందుకు మార్చింది? అదేవిధంగా.. ఎన్నికల కమిషనర్లపై ఎటువంటి కేసు నమోదు చేసేందుకు వీల్లేకుండా 2023లో చట్టం చేసింది. ప్రధాని మోదీ, అమిత్ షాలకు ఈసీ సాయం చేయడంతో పాటు ఓట్ల చోరీలో పాలుపంచుకుంటున్నందుకు ఎవరూ చర్యలు తీసుకోకూడదనే దీన్ని రూపొందించింది'' అని రాహుల్ గాంధీ ఆరోపించారు. బిహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' తొలిరోజు ముగింపు సభలో ప్రసంగిస్తూ.. రాజ్యాంగాన్ని, 'ఒక వ్యక్తి ఒక ఓటు' సూత్రాన్ని కాపాడుకునేందుకు పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా వ్యవహారంలో ప్రతిపక్షాల ఆరోపణలను అంతకుముందు ఎన్నికల సంఘం ఖండించిన విషయం తెలిసిందే. ఈసీకి ఎలాంటి భేదభావాలు ఉండవని, అన్ని పార్టీలను సమానంగా చూస్తుందని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. ఓటు చోరీ పేరుతో కొందరు అనవసర అనుమానాలు లేవనెత్తుతున్నారని ఆక్షేపించారు. రాజ్యాంగ సంస్థలను అవమానించడం సరికాదన్నారు. 'ఓట్ల చోరీ' ఆరోపణలపై రాహుల్ గాంధీ వారం రోజుల్లోపు అఫిడవిట్ సమర్పించాలని, లేనిపక్షంలో వాటిని నిరాధారమైనవిగా పరిగణిస్తామని స్పష్టం చేశారు.

## 21న ఓయూలో హాస్టల్ భవనాలను.. ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఈ కబురు: ఉస్మానియా యూనివర్సిటీలో 1,200 మంది విద్యార్థులకు వసతి కల్పించే విధంగా రూ. 80 కోట్ల వ్యయంతో నిర్మించిన రెండు హాస్టల్ భవనాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈమేరకు ఓయూ ఉప కులపతి ప్రొ. కుమార్ మొలుగరం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. సి కాశీం ఆదివారం సీఎం నివాసంలో ఆయన్ను కలిసి ఆగస్టు 21న జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు. ఇరవై ఏళ్ల కాలంలో ఓయూలోకి ముఖ్యమంత్రి హోదాలో వచ్చి ప్రసంగించనున్న తొలి సీఎం రేవంత్ రెడ్డినే అని వారు చెప్పారు. అదే రోజు ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ప్రొఫెసర్లను, విద్యార్థులను ఉద్దేశించి ''తెలంగాణ విద్యా రంగంలో రావాల్సిన మార్పులు, ప్రభుత్వ ప్రణాళిక'' అనే అంశం మీద సీఎం ప్రసంగించనున్నారు.అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖ ఆర్థిక సహాయంతో మరో 300 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు కొత్త హాస్టళ్ల నిర్మాణాలకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన జరగనుంది. దాంతో పాటు ఈ కార్యక్రమంలో ''సీఎం రీసెర్చ్ ఫెలో షిప్'' అనే పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

## భారత్‌కు తిరిగొచ్చిన గగన యాత్రికుడు

**శుభాంశు శుక్లాకు ఢిల్లీలో ఘనస్వాగతం**
**నేడు మోదీతో భేటీ**

ఈ కబురు,ఢిల్లీ: యాక్సియం4 మిషన్ ద్వారా రోదసియాత్ర పూర్తిచేసుకున్న వ్యోమగామి శుభాంశు శుక్లా ఆదివారం తెల్లవారుజామున భారత్‌కు తిరిగొచ్చారు. ఢిల్లీ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయనకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ వి.నారాయణన్ ఘన స్వాగతం పలికారు. శుభాంశు భార్య కామ్నా శుక్లా, కుమారుడు కియాష్‌లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి తరలి వచ్చిన ప్రజలు డ్రమ్స్ వాయిస్తూ, త్రివర్ణ పతాకాన్ని ఊపుతూ సందడి చేశారు. శుభాంశు వెంట మరో వ్యోమగామి ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ కూడా ఉన్నారు. అంతరిక్ష యాత్ర కోసం శిక్షణ పొందుతూ ఏడాదిగా శుభాంశు శుక్లా అమెరికాలో ఉన్నారు. జూన్ 25 నుంచి జులై 15 వరకూ ఆయన రోదసి యాత్ర నిర్వహించిన సంగతి తెలిసిందే. భూకక్ష్యలోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) చేరిన ఆయన.. మానవాళికి ప్రయోజనం కలిగించే అనేక ప్రయోగాలను నిర్వహించారు. భూమికి తిరిగి వచ్చినప్పటి నుంచి అమెరికాలోనే ఉంటున్నారు.

**నేడు లోక్‌సభలో ప్రత్యేక చర్చ**

శుక్లా.. సోమవారం ప్రధాని మోదీతో భేటీ అవుతారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ నెల 23న ఢిల్లీలో జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవంలో శుక్లా పాల్గొంటారు. 'ఐఎస్ఎస్‌కు భారత తొలి వ్యోమగామి' అనే అంశంపై సోమవారం లోక్‌సభలో చర్చకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.



మొదటి పేజి తరువాయి

## ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదు



**ఈ కబురు, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేపదే చెప్పే ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదని భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్ ఫార్మాసిటీ భూముల్లో స్థిరాస్తి వ్యాపారం చేయాలన్న రేవంత్‌రెడ్డి కల నెరవేరదని వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. "సీఎం రేవంత్‌రెడ్డి విజన్ లేని నాయకుడు. ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులు మోసపోయారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దు చేశారు. ఆ స్థానంలో ఫ్యూచర్ సిటీ అనే అవాస్తవ, ఊహాజనిత ప్రాజెక్టును ప్రవేశపెట్టారు. ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం 2013 భూసేకరణ చట్టం ప్రకారం సేకరించిన ఈ భూమిని స్థిరాస్తి ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదు. గతంలోనే ఈ విషయాన్ని శాసనసభలో వెల్లడించాను. ఫార్మాసిటీ భూముల వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు, రైతులకు స్పష్టత ఇవ్వాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.**

**ఈసీ సమగ్ర ప్రక్షాళన అవసరం..**

**ఎన్నికల సంఘం (ఈసీ) అధికార ఎన్డీయే ప్రభుత్వానికి అనుబంధ విభాగంలా పనిచేస్తోందని కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల సంఘం సమగ్ర ప్రక్షాళన అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల సంఘం నిర్వహించిన మీడియా సమావేశంపై ఆదివారం కేటీఆర్ ఒక ప్రకటనలో స్పందించారు. 'ఈసీ నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సమాధానాల కన్నా ప్రశ్నలే ఎక్కువగా ఉన్నాయి. సమస్యల పరిష్కారం కంటే సాకులే ఎక్కువ కనిపిస్తున్నాయి' అని కేటీఆర్ అసహనం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) అవసరమని, జాబితాలోని లోపాలను ఈసీఐ అంగీకరించినప్పుడు తమ విధులను నిర్లక్ష్యం చేసినట్లు కూడా ఒప్పుకోవాల్సిన అవసరం లేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు.**

మొదటి పేజి తరువాయి

# వచ్చే నెలాఖరులో స్థానికం!



ఈ కబురు, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలను వచ్చే నెలాఖరులో నిర్వహించాలనే దిశగా అధికార పార్టీలో చర్చలు సాగుతున్నాయి. సెప్టెంబరు ఆఖరులోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలున్నందున అప్పటివరకూ సమయం తీసుకోవాలని పార్టీ నేతలు కొందరు ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తాజా సమాచారం. మరోవైపు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 23న రాష్ట్ర కాంగ్రెస్ 'రాజకీయ వ్యవహారాల కమిటీ' (పీఏసీ) సమావేశం ఏర్పాటు చేయాలని పీసీసీకి సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. అందులో సీనియర్ నేతల అభిప్రాయాలు తీసుకుని, అత్యధికుల సూచనల మేరకు ఎన్నికలపై తుది నిర్ణయం ప్రకటించాలని నిర్ణయించారు. ఆదివారం మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ వీహెచ్‌లు జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వెళ్లి స్థానిక సంస్థల ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చించారు. కొందరు మంత్రులు వెంటనే ఎన్నికలు పెట్టాలని కోరుతున్న విషయం వీరి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. బీసీ రిజర్వేషన్ల కోసమే కుల గణన సర్వే చేసి... అసెంబ్లీలో బిల్లు ఆమోదించి రాష్ట్రపతికి పంపినందువల్ల దానికి కట్టుబడి ఉన్నామనే సందేశాన్ని ప్రజలకు పంపాల్సి ఉంటుందని ముగ్గురు నేతలు సీఎంకు చెప్పినట్లు తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్లకు కేంద్రం నుంచి స్పందన రాకపోవడంతో ఏం చేయాలనేదానిపైనా సమావేశంలో చర్చించారు. పార్టీపరంగా రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలకు వెళ్తే ఎలా ఉంటుందనే కోణంలో సమాలోచనలు జరిపినట్లు నేతలు తెలిపారు. రిజర్వేషన్ల అంశం తేలేవరకూ స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడానికి వీలుగా అవసరమైతే హైకోర్టును మరింత గడువు అడిగే అవకాశాలనూ పరిశీలించాలని మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించినట్లు సమాచారం. బీసీ రిజర్వేషన్లపై కేంద్రం ఎప్పటివరకు జాప్యం చేస్తుందో తెలియనందున ఏం చేయాలో తేల్చేందుకు పీఏసీ సమావేశంలో చర్చించాలని సీఎం చెప్పినట్లు తెలుస్తోంది.

**క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై చర్చ**

పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపైనా సీఎంతో ముగ్గురు నేతలు చర్చించారు. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు, పాత కాంగ్రెస్ శ్రేణులకు మధ్య తలెత్తుతున్న విభేదాలను చక్కదిద్దాలని పీసీసీ అధ్యక్షుడికి రేవంత్‌రెడ్డి సూచించినట్లు తెలుస్తోంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే నేతలపై పీసీసీ క్రమశిక్షణ కమిటీ విచారణ జరుపుతోందని మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పినట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నందున నేతల మధ్య సఖ్యత కుదిర్చి... అందరూ కలసికట్టుగా పని చేసేలా చూడాలని సమావేశంలో నిర్ణయించారని పార్టీ వర్గాలు తెలిపాయి.

# ఆధారాలైనా చూపండి.. క్షమాపణైనా చెప్పండి

**అందరి సమక్షంలోనే ఎస్ఐఆర్**

''బిహార్‌లో ప్రత్యేక ముమ్మర సవరణ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ఎస్ఐఆర్) కింద ప్రాథమిక ఓటర్ల జాబితాను బూత్‌స్థాయి అధికారులు(బీఎల్‌వోలు), రాజకీయపార్టీల ఏజెంట్లు, సర్పంచుల సమక్షంలోనే తయారుచేశాం. వారందరి సంతకాలు, వీడియో సాక్ష్యాలు ఉన్నాయి. ఏవైనా తప్పులుంటే ఫిర్యాదుచేయడానికి సెప్టెంబరు 1 వరకు సమయం ఉంది. 90,000 మంది బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి 7.89 కోట్లమందికి ఎన్యూమరేషన్ ఫారాలు ఇస్తే 30 రోజుల్లోపు అందులో 7.24 కోట్ల ఫారాలు వివరాలతో మాకు అందాయి. తొలగించిన 65 లక్షల మంది వివరాలు ఆయా జిల్లాల వెబ్‌సైట్లలో ఉన్నాయి. ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటుఉన్నా ఒకచోటే ఓటు వేయగలరు. రెండుచోట్ల వేయడం నేరం. సుప్రీం ఆదేశాలు 24 గంటల్లోనే అమలు ప్రతి జిల్లాకు ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించి, దాంట్లో ఎపిక్ నంబరుతో వెతికేలా సూచిక పెట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో 24 గంటల్లోపే మేం దాన్ని అమలుచేశాం. ప్రతి జిల్లా వెబ్‌సైట్ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రాథమిక జాబితాను ఆగస్టు 1న ప్రతి రాజకీయపార్టీకీ అందించాం. సెప్టెంబరు ఒకటోతేదీ లోపు వచ్చే ఫిర్యాదుల ఆధారంగా అర్హులను చేర్చడానికి, అనర్హుల్ని తొలగించడానికి కచ్చితంగా ప్రయత్నిస్తాం. రాజ్యాంగం మాకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించడానికి ఓటర్ల పౌరసత్వాన్ని తనిఖీ చేస్తున్నాం. 20 ఏళ్లలో మృతులు 22 లక్షలు సాధారణ ఓటర్ల జాబితా సవరణ జరిగినప్పుడు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారం ఇవ్వరు. 2003 తర్వాత జరిగిన సవరణల్లో మరణించినవారి పేర్లు తొలగించలేదు. ఇప్పుడు మృతులందరినీ ఒకేసారి జాబితా నుంచి తొలగించడంతో 22 లక్షలమంది చనిపోయినట్లు కనిపిస్తోంది. ఇవి గత 20 ఏళ్ల గణాంకాలు తప్పితే ఆరు నెలలవి కాదు. మెషీన్ రీడబుల్ జాబితా ఎందుకు ఇవ్వట్లేదంటే.. మెషీన్ రీడబుల్ ఓటరు జాబితా, సెర్చబుల్ ఓటరు జాబితా మధ్య తేడా ఉంటుంది. ఈసీ వెబ్‌సైట్‌లోని జాబితాలో ఓటరు గుర్తింపు సంఖ్యతో వివరాలు వెతికి, డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మెషీన్ రీడబుల్ జాబితా వల్ల ఓటర్ల గోప్యత దెబ్బతినే అవకాశం ఉంటుందని సుప్రీంకోర్టు 2019లో చెప్పింది. ఈ జాబితా ఇస్తే ఒకరి పేర్లు, ఫొటోల స్థానంలో వేరొకరివి చేర్చి ఓటేసే వీల్లేకుండా చేసే పరిస్థితి ఉంటుంది.


**రాజ్యాంగాన్ని అవమానించడం కాదా?**

ఏ అభ్యర్థికైనా తాను పోటీచేసిన ఎన్నికపై అభ్యంతరం, అనుమానాలుంటే 45 రోజుల్లోపు మాత్రమే హైకోర్టును ఆశ్రయించి ఎన్నికల పిటిషన్ దాఖలు చేయడానికి వీలుంటుంది. ఆ తర్వాత నిరాధార ఆరోపణలు చేయడం వెనుక ఉద్దేశమేంటి అన్నది ఓటర్లు, ప్రజలు పూర్తిగా అర్థం చేసుకోగలరు. కొందరు ఓటుచోరీ లాంటి తప్పు మాటలు ఉపయోగిస్తూ ప్రజలను మభ్యపెట్టడానికి విఫలయత్నం చేస్తున్నారు. ఇది రాజ్యాంగాన్ని అవమానించడం కాకపోతే ఇంకేంటి? లోక్‌సభ ఎన్నికల్లో కోటిమందికి పైగా ఉద్యోగులు, 10 లక్షల మంది బూత్ ఏజెంట్లు, 20 లక్షల మంది బీఎల్‌వోలు



# ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్

ఈ కబురు,న్యూఢిల్లీ: ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎవరన్న దానిపై ఉత్కంఠ వీడింది. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పేరును బీజేపీ ఖరారు చేసింది. ఆదివారం ఢిల్లీలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షాతోపాటు తెలంగాణకు చెందిన కె.లక్ష్మణ్ ఈ సమావేశానికి హాజరయ్యారు. సుదీర్ఘంగా చర్చించిన తర్వాత సీపీ రాధాకృష్ణన్ పేరుకు పార్లమెంటరీ బోర్డు ఆమోదం తెలిపింది. అనంతరం జేపీ నడ్డా మీడియా సమావేశంలో రాధాకృష్ణన్ పేరును ప్రకటించారు. తమిళనాడుకు చెందిన చంద్రాపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ 1957 మే 4న జన్మించారు. 1993 నుంచి 1998 వరకు ఆర్‌ఎస్ఎస్ ప్రాంత సంఘచాలక్‌గా పనిచేశారు. కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు బీజేపీ తరఫున ఎంపీగా ఎన్నికయ్యారు. తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగానూ పనిచేశారు. 2016 నుంచి 2019 వరకు ఆలిండియా కాయర్ బోర్డు చైర్మన్‌గా సేవలందించారు. 2023 ఫిబ్రవరి 18న ఝార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2024 మార్చి 19 నుంచి జూలై 31 వరకు తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. 2024 జూలై 27న మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులై కొనసాగుతున్నారు.2022లో ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన జగదీప్ ధన్‌ఖడ్.. అనారోగ్య కారణాలు చూపుతూ ఈ ఏడాది జూలై 21న అనూహ్యంగా పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఉప రాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసింది. ఆగస్టు 7న నోటిఫికేషన్ ఇవ్వగా, 21 వరకు నామినేషన్లకు అవకాశం కల్పించింది. సెప్టెంబరు 9న పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రకటించిన అభ్యర్థికే తమ మద్దతు అని, అభ్యర్థి ఎవరనేదీ ఆయన అభీష్టమేనని ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ప్రకటించాయి. ఈ నెల 6న జరిగిన సమావేశంలో టీడీపీ సహా కీలక భాగస్వామ్య పక్షాలన్నీ ఈ మేరకు ప్రకటనలు చేశాయి. అయితే 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అదే రాష్ట్రానికి చెందిన సీపీ రాధాకృష్ణన్‌ను ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా బీజేపీ ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాధాకృష్ణన్ అభ్యర్థిత్వానికి ప్రతిపక్ష పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తుందని బీజేపీ భావిస్తోంది. విపక్ష ఇండియా కూటమిలో కీలకంగా ఉన్న తమిళనాడులోని అధికార డీఎంకే.. సీపీ రాధాకృష్ణన్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించదని అంచనా వేస్తోంది.చంద్రబాబు శుభాకాంక్షలు.. రాంచందర్‌రావు హర్షం.. ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడం పట్ల బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ హర్షం వ్యక్తం చేసింది. సుదీర్ఘ అనుభవం కలిగిన రాధాకృష్ణన్ ఉప రాష్ట్రపతిగా అందరి మన్ననలు పొందుతారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీయే తరఫున ఎంపికైన సీపీ రాధాకృష్ణన్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ రాజనీతిజ్ఞుడు, సుదీర్ఘకాలం దేశానికి సేవలందించిన గౌరవప్రదమైన నాయకుడు అయిన సీపీ రాధాకృష్ణన్ ఉప రాష్ట్రపతిగా నామినేషన్ వేయడాన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు.



పార్లమెంట్ ఉభయ సభల్లో ఉన్న వివిధ ఖాళీలతో కలిపి ప్రస్తుత సభ్యుల సంఖ్య 786. ఇందులో ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మెజారిటీకి 394 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం లోక్‌సభలో ఎన్డీఏకు 293 మంది, రాజ్యసభలో 129 మంది సభ్యుల మద్దతు ఉంది. ఉభయ సభల్లో కలిపి ఎన్డీఏ బలం 422. ప్రతిపక్ష ఇండియా కూటమికి లోక్‌సభలో 234 మంది, రాజ్యసభలో 79 మంది సభ్యులు.. మొత్తంగా 313 మంది అనుకూలంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సీపీ రాధాకృష్ణన్ విజయం లాంఛనమే కానుంది. మెజారిటీ లేకపోయినా.. తమ వాణి వినిపించాలని ఇండియా కూటమి భావిస్తోంది. ఎన్డీఏ తమ అభ్యర్థిని ప్రకటించిన నేపథ్యంలో ఇండియా కూటమి తరఫున అభ్యర్థి అంశంపై చర్చించేందుకు కూటమి నేతలు సోమవారం ఉదయం సమావేశమవుతారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే ఉప రాష్ట్రపతి ఎన్నిక ఏకగ్రీవమయ్యేందుకు ప్రతిపక్ష పార్టీలతో చర్చలు జరుపుతామని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రకటించారు.

మొదటి పేజీ తరువాయి

## బీటెక్ మేనేజ్మెంట్ కోటా అడ్మిషన్ గడువు పెంపు

ఈ కబురు: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో బీటెక్, బీఈ మొదటి సంవత్సరం మేనేజ్ మెంట్ కోటా (బీ-కేటగిరీ) సీట్ల అడ్మిషన్ల గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్టు తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టీజీసీహెచ్ఈ) ప్రకటించింది. భారీ వర్షా ల కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మండలి తెలిపింది. ఈ నెల 18 వరకు మేనేజ్మెంట్ కోటా సీట్లకు సంబంధించి అడ్మిషన్ల గడువు ఉండగా, ప్రస్తుతం ఈ గడువును ఆగస్టు 25 వరకు పొడిగించారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత, బీకేటగిరీ కింద ప్రవేశం పొందిన విద్యార్థుల జాబితాను ఈ నెల 30లోగా కౌన్సిల్‌కు సమర్పించాలని కళాశాలలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయంతో వర్షా ల వల్ల ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు, కళాశాలలకు కొంత ఊరట లభించినట్టయింది. ఇదిలా ఉంటే ఇంజనీరింగ్ కాలేజీల యాజామాన్యాలు సైతం తమ కాలేజీల్లో అడ్మిషన్ల కొరత ఉందని, గడువును పొడిగించాలని కోరినట్లు సమాచారం.'

## దంచికొడుతున్న వర్షం.. సముద్రం అల్లకల్లోలం



ఈ కబురు: విశాఖలో వర్షం దంచికొడుతోంది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వాన పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. రోడ్లపై వర్షపు నీరు నిలచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిసర ప్రాంతాలన్నీ నీటమునిగాయి. కొండవాలు ప్రాంతాల్లో గోడలు కూలిపోతున్నాయి.మరోవైపు ఈ రోజు రాత్రి భారీ వర్షా లు పడతాయని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. విశాఖకు రెడ్ అలర్ట్ జారీ చేశారు ఆర్కే బీచ్ వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. తీరం వెంబడి ఈదురు గాలులు సైతం వీస్తున్నాయి. సముద్రంలో ఉధృతంగా అలలు దూసుకొస్తున్నాయి. దీంతో మత్స్యకారులను చేపలవేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో మోస్తరు నుంచి భారీ వర్షా లు కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు.

# ఆ రెండూ వదులుకుంటేనే శాంతి



ఈ కబురు ,న్యూయార్క్: యుద్ధం ముగించాలంటే ఉక్రెయిన్ తటస్థత పాటించాలని, నాటోకు దూరంగా ఉండాలని తొలి నుంచీ రష్యా డిమాండ్ చేస్తూ వస్తోంది. ఈ ప్రధాన అంశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో అలాస్కా వేదికగా జరిగిన సమావేశంలో పుతిన్ ప్రస్తావించారు. దీంతో పాటు మరో కీలక డిమాండ్‌ను కూడా రష్యా అధ్యక్షుడు పెట్టారు. అదే రానున్న రోజుల్లో ఉక్రెయిన్‌లో శాంతి ఏర్పడుతుందా..? యుద్ధం కొనసాగుతుందా..? అన్న విషయాన్ని నిర్ణయించనుంది.మూడు గంటలకు పైగా డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన సమావేశంలో శాంతి నెలకొనాలంటే తూర్పు ఉక్రెయిన్‌లోని డాన్‌బాస్ ప్రాంతంలోని డొనెట్స్క్, లుహాన్స్క్ ప్రాంతాలను ఉక్రెయిన్ వదులుకోవాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పష్టం చేశారు. డొనెట్‌స్క్‌లోని 70 శాతం ప్రాంతం మాస్కో అధీనంలో ఉంది. లుహాన్‌స్క్‌లో వందశాతం ఇప్పటికే రష్యా దళాలు ఆక్రమించేశాయి. ఈ డిమాండ్‌ను గతంలోనూ జెలెన్‌స్కీ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో సోమవారం వాషింగ్టన్ డీసీలో జెలెన్‌స్కీ భేటీ కానున్నారు. ఈ సమావేశంలో పుతిన్ లేవనెత్తిన ఈ కీలక డిమాండ్‌ను జెలెన్‌స్కీ దృష్టికి ట్రంప్ తీసుకెళ్లనున్నారు.

ట్రంప్ ఒప్పించగలరా..!

పుతిన్‌తో సమావేశానంతరం ట్రంప్ స్వరం మారింది. తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి మాస్కో అంగీకరించకపోతే రష్యాపై ఆంక్షల పిడుగు పడనుందని హెచ్చరిస్తూ వచ్చిన ట్రంప్.. అలాస్కా భేటీ అనంతరం మెత్తబడ్డారు. తాత్కాలిక కాల్పుల విరమణతో పెద్దగా ప్రయోజనం లేదని.. శాశ్వత శాంతితోనే రెండు దేశాలకు మేలు జరుగుతుందని అన్నారు. ఒప్పందం కుదుర్చుకోవడమే ఉక్రెయిన్ ముందున్న మార్గమని తెలిపారు. రష్యా శక్తిమంతమైన దేశమన్న విషయాన్ని కీవ్ గుర్తుంచుకోవాలని కూడా తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం జరిగే సమావేశంలో జెలెన్‌స్కీని పుతిన్ డిమాండ్లకు ట్రంప్ ఒప్పించగలరా అన్నది కీలకం కానుంది.

# తెలంగాణకు మరోసారి రెడ్ అలర్ట్స్.. అత్యంత భారీ వర్షా లు



ఈ కబురు: రాష్ట్రంలో రేపు, ఎల్లుండి అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ చేసింది. అలాగే కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో గాలివేగం గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆదివారం రాష్ట్రంలో అత్యధికంగా ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమరం భీం జిల్లాలలో అత్యధిక వర్షాపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం పేర్కొంది.ఆదిలాబాద్ జిల్లా తాంసి లో 17 సెం.మీ వర్షాపాతం:ఆదివారం ఆదిలాబాద్ లో 17 సెం.మీ, ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో 16 సెం.మీ, నిర్మల్ జిల్లా సారంగపూర్ లో 13 సెం.మీ, మంచిర్యాల జిల్లా భీమినిలో 12 సెం.మీ, కుమరంభీం జిల్లా జైనూరులో 10 సెం.మీ, కుమరం భీం జిల్లా కెరమెనిలో 10 సెం.మీ, మంచిర్యాల 10 సెం.మీ, ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ లో 9 సెం.మీ, భోథ్ లో 9 సెం.మీ, జగిత్యాల జిల్లా వెల్గటూరులో 9 సెం.మీ, నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ లో 8 సెం.మీ, కుమరం భీం జిల్లా దహెగాంలో 7 సెం.మీ, మంచిర్యాల జిల్లా జైపూర్ లో 7 సెం.మీ, తాండూర్ లో 7 సెం.మీ, ముధోల్ లో 7 సెం.మీ, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ లో 6 సెం.మీ, కుమరం భీం జిల్లా కాగజ్ నగర్ లో 6 సెం.మీ, సిర్పూర్ లో 5 సెం.మీ చొప్పున వర్షాపాతం నమోదైంది.

# మోటార్లు మీరు ఆన్ చేస్తారా? మేం ఆన్ చేయాలా?

**కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందనే అబద్ధపు ప్రచారాన్ని కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని.. గోదావరిలో వరద జలాలను ఒడిసిపట్టకుండా, వృధాగా సముద్రంలోకి వదిలేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు.**

కాళేశ్వరంపై అబద్ధపు ప్రచారాలను కప్పిపుచ్చుకొనేందుకు ప్రభుత్వం కుట్ర
వరద నీటిని ఒడిసిపట్టకుండా వృథాగా సముద్రంలోకి వదిలేస్తున్నారు
ఎస్సారెస్పీలోకి నీళ్లొస్తున్నా మిడ్‌మానేరు, ఎల్ఎండీ ఎందుకు నింపట్లేదు?
కాళేశ్వరం మోటార్లు పాడయ్యేలా కుట్రలు
రైతుల్ని గోసపెడ్తరా? : హరీశ్ ధ్వజం

ఈ కబురు: కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందనే అబద్ధపు ప్రచారాన్ని కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని.. గోదావరిలో వరద జలాలను ఒడిసిపట్టకుండా, వృధాగా సముద్రంలోకి వదిలేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాల కోసం రైతులపై పగ తీర్చుకుంటోందని వ్యాఖ్యానించారు. ఎల్లంపల్లికి భారీగా వరద వస్తోందని, మోటార్లు ఆన్ చేస్తే నీళ్లు మిడ్‌మానేరులోకి వచ్చిపడతాయని.. అయినా ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయడం లేదని చెప్పారు. 'మోటార్లు మీరు ఆన్ చేస్తారా? లేక వేలాది మంది రైతులతో కలసి వచ్చి మేమే మోటార్లు ఆన్ చేయాలా?' అని నిలదీశారు. ఆదివారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ''ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 62వేల క్యూసెక్కుల వరద వస్తోంది. కడెం ప్రాజెక్టు నుంచి లక్షన్నర క్యూసెక్కుల వరద ఎల్లంపల్లికి వస్తోంది.కాళేశ్వరం ప్రాజెక్టులోని గాయత్రి పంపుహౌస్, నంది మేడారంలో మోటార్లు స్విచాన్ చేస్తే రోజుకు రెండు టీఎంసీల నీళ్లు వచ్చి మిడ్ మానేరులో పడతాయి. వారం కిందటే మంత్రి ఉత్తమ్‌కు దీనిపై లేఖ రాశాం. అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లు, చెరువులు ఖాళీగా ఉన్నాయని.. వరద నీటిని ఎత్తిపోసి నింపాలని కోరాం. కానీ స్పందన లేదు. మోటార్లు ఆన్ చేయకుండా నీళ్లన్నీ సముద్రంలోకి వదులుతున్నారు'' అని హరీశ్‌రావు మండిపడ్డారు. వానలు సరిగా లేక రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చెరువులు నిండలేదని, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో రిజర్వాయర్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మానుకుని, వరద నీటిని ఒడిసిపట్టాలన్నారు. ''కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని చెప్పిన అబద్ధాన్ని కప్పిపుచ్చుకోవడానికి మోటార్లను ఆన్ చేయడం లేదా? కృష్ణా ప్రాజెక్టులకు వరదలతో ఉచితంగా జల విద్యుత్తు అందుతోంది. దానితో మోటార్లు నడిపించి రిజర్వాయర్లు నింపడానికి రేవంత్‌రెడ్డికి, ఉత్తమ్‌కు ఏం అడ్డం వచ్చింది? మిడ్ మానేరు, ఎల్ఎండీ ఖాళీగా ఉన్నాయి. ఎస్సారెస్పీలోకి వరద వస్తున్నా వరద కాలువ తెరిచి వాటిలోకి నీళ్లు ఎందుకు వదలడం లేదు?'' అని హరీశ్‌రావు నిలదీశారు. రిజర్వాయర్లన్నీ నింపితే యాసంగిలో లక్షల ఎకరాల్లో పంటలు పండుతాయని చెప్పారు.

**మోటార్లు పాడయ్యేలా కుట్ర!**

కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్ల నిర్వహణలో ప్రభుత్వం కుట్ర చేస్తోందని.. వాటిని తరచూ ఆన్, ఆఫ్ చేస్తూపోతే పాడైపోయి వేల కోట్ల నష్టం వస్తుందని హరీశ్‌రావు ఆరోపించారు. బీహెచ్ఈఎల్ సంస్థ కూడా దీనిపై ప్రభుత్వాన్ని హెచ్చరించిందని చెప్పారు. మోటర్లు పాడైపోయేలా చేసి బీఆర్ఎస్‌ను బద్నాం చేయాలని చూస్తున్నారా? అని ప్రశ్నించారు. తాను అవగాహనతోనే ఈ విషయం చెబుతున్నానన్నారు.



# పదేళ్లలో 126 నుంచి 18 జిల్లాలకు..



**తగ్గుతున్న మావోయిస్టుల ప్రభావం**

ఈ కబురు, హైదరాబాద్: దేశంలో వామపక్ష తీవ్రవాదం కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం బహుముఖ వ్యూహం అనుసరిస్తోంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఒకపక్క గాలింపులు.. మరోపక్క రూ.వేల కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతోంది. ఫలితంగా గత పదేళ్లలో మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య 126 నుంచి 18కి చేరింది. ఈ మేరకు ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నివేదిక విడుదల చేసింది. వామపక్ష తీవ్రవాదం కట్టడి చేసేందుకు తీసుకుంటున్న చర్యల గురించి ఇందులో వివరించింది. వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం 2015లో జాతీయ విధానం తీసుకొచ్చింది. మావోయిస్టులతో పోరాడేందుకు రాష్ట్రాలకు సాయం చేయడంతోపాటు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయడం మొదలుపెట్టింది. మావోయిస్టుల గాలింపు కోసమయ్యే ఖర్చునూ కొంతవరకు భరిస్తోంది. దీనిలో భాగంగా ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే దాదాపు 50 వేల మందికిపైగా కేంద్ర పారామిలిటరీ బలగాలను వినియోగిస్తున్నారు. తెలంగాణ గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్ డిస్ట్రిక్ట్ రిజర్వు గార్డ్స్, మహారాష్ట్ర సి60 తరహాలో దాదాపు అన్ని రాష్ట్రాలూ ప్రత్యేక కమాండో వ్యవస్థలు ఏర్పాటు చేసుకున్నాయి. వీటి కోసం సంబంధిత రాష్ట్రాలకు రూ.1,740 కోట్లు మంజూరు చేసింది. లొంగిపోయిన మావోయిస్టులకు ఉపాధి కల్పించడం, కాల్పుల్లో మరణించిన సాధారణ ప్రజల కుటుంబాలకు సాయం చేసేందుకు సెక్యూరిటీ రిలేటెడ్ ఎక్స్‌పెండిచర్(ఎస్ఆర్ఈ) పథకం కింద రూ.3,364.32 కోట్లు మంజూరు చేసింది. గిరిజన ప్రాంతాల్లో యువతకు విద్య, ఉపాధి కల్పించేందుకు 46 ఐటీఐలు, 49 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, 179 ఏకలవ్య గురుకులాలు, 5,899 పోస్టాఫీసులు, 1,007 బ్యాంకు శాఖలు, 937 ఏటీఎంలు ఏర్పాటు చేసింది. మౌలిక వసతులు కల్పించేందుకు స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ పథకం కింద రూ.3,769 కోట్లు కేటాయించింది. ఆయా గ్రామాల్లో రోడ్ రిక్వైర్‌మెంట్ ప్లాన్(ఆర్ఆర్‌పీ) పథకం పేరుతో 14,928 కి.మీ. మేర రోడ్లు వేసింది. టెలికాం సేవల కోసం రూ.8,640 కోట్లు మంజూరు చేసింది. కొత్తగా 70 ఇండియన్ రిజర్వు బెటాలియన్లు మంజూరు చేయడంతోపాటు 621 ఎటాక్‌ప్రూఫ్ పోలీస్‌స్టేషన్లు నిర్మించింది.

# గ్రామాల సమస్యలపై 21 నుంచి ఆందోళనలు



భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రామాలకు నిధులు అందకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్, గత భారాస ప్రభుత్వాలు పల్లెలను నిర్వీర్యం చేశాయన్నారు. ఆదివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో భాజపా శ్రేణులకు రామచందర్‌రావు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లోని సమస్యలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ నెల 21 నుంచి 25 వరకు 566 మండలాల్లో ర్యాలీలు నిర్వహించాలన్నారు. అనంతరం ఆయా మండలాల తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేసి, ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఈ నెల 26 నుంచి సెప్టెంబరు 2 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు చేపట్టాలని, అనంతరం కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని చెప్పారు. తాను రంగారెడ్డి జిల్లాలోని ఒక మండలంలో 24 గంటలు బస చేస్తానని, ఆ మండలంలోని ప్రతి గ్రామంలో యువ, మహిళా సమ్మేళనాలు, రచ్చబండ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రామచందర్‌రావు వివరించారు. పార్లమెంటు సమావేశాలు ముగిసిన తర్వాత పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా స్థానిక సంస్థల ఎన్నికల కోసం పనిచేయనున్నారని తెలిపారు. సమావేశంలో భాజపా సంఘటనా కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కాసం వెంకటేశ్వర్లు, ప్రేమేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబరు 2 నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు

**నేటి నుంచి రెండో విడత శిక్షణ కార్యక్రమం**
**రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో భూ సర్వేకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నామని, అక్టోబరు 2(గాంధీ జయంతి) నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన భూ కొలతలు, భూ దస్త్రాల నిర్వహణ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..'భూముల రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి చేస్తూ భూభారతి చట్టం అమల్లోకి తీసుకొచ్చిన నేపథ్యంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు ప్రాధాన్యంగా మారాయి. అవసరమైన సర్వేయర్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మొదటి దశలో ఈ ఏడాది మే 26 నుంచి జులై 26 వరకు జిల్లా కేంద్రాల్లో ఏడు వేల మందికి శిక్షణ ఇచ్చాం. అనంతరం గత నెలాఖరున జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ప్రాక్టికల్ పరీక్షలు పూర్తి చేశాం. అర్హులకు 40 రోజులపాటు అప్రెంటిస్ శిక్షణ ఇస్తున్నాం. ఈ శిక్షణ పూర్తయిన వెంటనే లైసెన్స్‌లు జారీ చేసి వారి సేవలను సమర్థంగా వినియోగించుకుంటాం. అందుకు వీలుగా సర్వే మాన్యువల్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించాం. రెండో విడత శిక్షణ సోమవారం నుంచి జిల్లా కేంద్రాల్లో ప్రారంభమవుతుంది. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు ఉదయం 10 గంటల లోపు సర్వే విభాగం సహాయ సంచాలకులకు రిపోర్ట్ చేయాలి' అని సూచించారు.



# పిల్లలు కనడానికి సిద్ధమవుతున్న రోబోలు!

**స్త్రీ, పురుషుల కలయికతో పిల్లలు పుట్టడం సర్వసాధారణం. ఇప్పుడు టెక్నాలజీ పెరగడంతో టెస్ట్ ట్యూబ్ బేబీలు పుడుతున్నారు. సరోగసీ ద్వారా కూడా పిల్లలను కంటున్నారు. అయితే శిశువు పుట్టడానికి మనిషి గర్భమే అవసరం లేదంటూ.. చైనా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. దీనికోసం ప్రత్యేకంగా 'గర్భధారణ రోబోట్'లను సృష్టిస్తున్నారు. వినడానికి ఇది వింతగా ఉన్నా.. దీనికి సంబంధించిన మరిన్ని ఆసక్తికరమైన విషయాలు తెలుసుకోవాలంటే, ఈ కథనం చదవాల్సిందే..**




ప్రపంచంలోనే మొట్టమొదటి 'గర్భధారణ రోబోట్'పై చైనా శాస్త్రవేత్తలు పని చేస్తున్నారని, ఇది సజీవ శిశువుకు జన్మనిస్తుందని ది టెలిగ్రాఫ్ నివేదించింది. ఈ టెక్నాలజీ గర్భధారణ నుంచి ప్రసవం వరకు గర్భధారణకు కావలసిన అన్ని విషయాలను అనుకరిస్తుందని నిపుణులు పేర్కొన్నారు.

పిండం అనేది గర్భధారణ రోబో.. కృత్రిమ గర్భంలోనే పెరుగుతుంది. పిండాలకు కావలసిన పోషకాలు అన్నీ కూడా ట్యూబ్స్ ద్వారా అందిస్తారు. అయితే అండం, స్పెర్మ్ ఎలా.. ఎక్కడ ఫలదీకరణం అవుతుందనే విషయాలను ప్రస్తుతానికి శాస్త్రవేత్తలు వెల్లడించలేదు. సింగపూర్‌లోని నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ 'జాంగ్ కిఫెంగ్' నేతృత్వంలోని గ్వాంగ్‌జౌకు చెందిన కైవా టెక్నాలజీ ఈ రోబోను అభివృద్ధి చేస్తోంది.

ఈ టెక్నాలజీ విజయవంతమైతే.. సంతానం లేని జంటలకు లేదా జీవసంబంధమైన గర్భధారణ చేయించుకోవడానికి ఇష్టపడని వారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం ఈ టెక్నాలజీ పరిణతి చెందిన దశలో ఉందని డాక్టర్ జాంగ్ పేర్కొన్నారు. పిండం.. రోబోట్ కృత్రిమ గర్భంలో పెరగడానికి కావలసిన జాగ్రత్తలు తీసుకుంటున్నాము. ఈ రోబోట్ నమూనా 2026 నాటికి అందుబాటులోకి రానున్నట్లు సమాచారం.

మనిషి గర్భంతో పనిలేకుండా రాబోయే టెక్నాలజీ బాగానే ఉంది. కానీ ఇది ప్రతికూల ప్రభావాలకు దారి తీస్తుందేమో అని కొందరు అభిప్రాయపడుతున్నారు. తల్లి, బిడ్డల పేగు బంధం లేకపోతే.. పిల్లల మానసిక ప్రభావం ఎలా ఉండబోతుందో అని ఆందోళన చెందుతున్నారు. అంతే కాకుండా ఇది చట్టపరంగా సాధ్యమేనా?, చట్టాలు దీనికి ఒప్పుకుంటాయా అనే అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు.




## కొరియా బ్రాండ్ కారుకు డిమాండ్!.. నాలుగు నెలల్లో 21000 బుకింగ్స్

సౌత్ కొరియా బ్రాండ్ అయిన కియా మోటార్స్.. దేశీయ మార్కెట్లో అతి తక్కువ కాలంలోనే అధిక ప్రజాదరణ పొందింది. ఎప్పటికప్పుడు కొత్త కార్లను పరిచయం చేసే ఈ కంపెనీ ఇండియాలో కియా కారెన్స్ క్లావిస్ & కారెన్స్ క్లావిస్ ఈవీ లాంచ్ చేసింది.

కియా ఇండియా లాంచ్ చేసిన ఈ రెండు కార్లు నాలుగు నెలల్లోనే 21,000 బుకింగ్‌లను పొందినట్లు కంపెనీ ప్రకటించింది. కారెన్స్ క్లావిస్ 20,000 కంటే ఎక్కువ బుకింగ్‌లను పొందగా.. క్లావిస్ ఈవీ 1,000 కంటే ఎక్కువ ఆర్డర్‌లను పొందింది. దీన్ని బట్టి చూస్తే మార్కెట్లో వీటికి మంచి డిమాండ్ ఉన్నట్లు స్పష్టం అవుతోంది.

కియా కారెన్స్ క్లావిస్ మంచి డిజైన్.. అప్డేటెడ్ ఫీచర్స్ పొందుతుంది. ఇది స్లైడింగ్ అండ్ రిక్లైనింగ్ రెండవ వరుస సీట్లు, వన్‌టచ్ ఎలక్ట్రిక్ టంబుల్,



మూడవ వరుస యాక్సెస్‌ను సులభతరం చేయడానికి సెగ్మెంట్ ఫస్ట్ బాస్ మోడ్ వంటివి పొందుతుంది. ఇందులో 12.3 ఇంచెస్ పనోరమిక్ డిస్‌ప్లేలు, బోస్ 8 స్పీకర్ ఆడియో, 64 కలర్ యాంబియంట్ లైటింగ్, డ్యూయల్ డాష్‌క్యామ్ వంటివి మాత్రమే కాకుండా క్లైమేట్ కంట్రోల్/ఇన్ఫోటైన్‌మెంట్ స్వాప్ స్విచ్ వంటివి కూడా ఉన్నాయి.

క్లావిస్ ఈవీ విషయానికి వస్తే.. ఇది 42 కిలోవాట్, 51.4 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్స్ పొందుతుంది. 42kWh యూనిట్ 404 కి.మీ రేంజ్ అందిస్తే.. 51.4kWh యూనిట్ 490 కిమీ రేంజ్ అందిస్తుందని ఏఆర్ఏఐ ధ్రువీకరించింది. ఈ కారు 100 kW డీసీ ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. కేవలం 39 నిమిషాల్లోనే 10 నుంచి 80 శాతం ఛార్జ్ చేసుకోగలదు. సేఫ్టీ పరంగా కూడా ఇవి రెండూ లేటెస్ట్ ఫీచర్స్ పొందుతాయి.




## భారత్‌లో ఐఫోన్ 17 తయారీ!

ప్రముఖ టెక్ దిగ్గజం, యాపిల్ ఉత్పత్తుల సప్లయర్‌గా ఉన్న ఫాక్స్‌కాన్ భారత్‌లో ఐఫోన్ 17 ఉత్పత్తిని ప్రారంభించింది. రెండో అతిపెద్ద యూనిట్ అయిన బెంగళూరు ప్లాంట్‌లో ఈ సంస్థ పరిమిత స్థాయిలో మొబైల్ తయారీ చేపట్టినట్లు సమాచారం. 2.8 బిలియన్ (దాదాపు రూ.25 వేల కోట్లు)ల పెట్టుబడితో దేవనహళ్లి సమీపంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్, చైనా బయట ఫాక్స్‌కాన్ ఏర్పాటు చేసిన రెండో అతిపెద్ద ఫ్యాక్టరీ. ఇది చెన్నైలోని యూనిట్‌కు అదనంగా కొనసాగుతుంది. ఐఫోన్ 17 తయారీపై యాపిల్, ఫాక్స్‌కాన్ అధికారికంగా స్పందించాల్సి ఉంది.

## ఆ రాష్ట్రంలో భారీగా బయటపడ్డ బంగారు నిక్షేపాలు





**భారతదేశంలో బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. తులం గోల్డ్ రేటు లక్ష రూపాయలు దాటేసి చాలా రోజులైంది. ఇలాంటి సమయంలో ఒడిశాలో భారీ స్థాయిలో బంగారు ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (GSI) వెల్లడించింది. దేవ్‌ఘర్‌లో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు నిర్ధారించారు. అయితే సుందర్‌గఢ్, నబరంగ్‌పూర్, కియోంఝర్, అంగుల్, కోరాపుట్‌లలో మాత్రమే కాకుండా.. మయూర్‌భంజ్, మల్కన్‌గిరి, సంబల్‌పూర్, బౌధ్‌లలో అన్వేషణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు.. ఒడిశాలో బంగారు నిక్షేపాల నిల్వలు ఎంత ఉన్నాయనే విషయం అధికారికంగా వెల్లడికాలేదు. అయితే నిల్వలు 10 నుంచి 20 మెట్రిక్ టన్నులు ఉండే అవకాశం ఉందని విశ్లేషకుల అంచనా.ఇది భారతదేశం దిగుమతి చేసుకుంటున్న బంగారం పరిమాణంతో పోలిస్తే ఇది చాలా తక్కువ.గత సంవత్సరం భారతదేశం 700 - 800 మెట్రిక్ టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంది. దేశంలో గోల్డ్ ఉత్పత్తి తక్కువగా ఉండటమే ఎక్కువగా దిగుమతి చేసుకోవడానికి ప్రధాన కారణం. ప్రస్తుతం ఉత్పత్తి పరిమాణం పెరిగే అవకాశం ఉంటుంది. దిగుమతి కొంత తగ్గుతుందని పలువురు భావిస్తున్నారు.**




## గూగుల్‌లో పర్సనల్ ఇంటర్వ్యూలు: సుందర్ పిచాయ్

ఒకప్పుడు ఇంటర్వ్యూ అంటే.. ముఖాముఖి నిర్వహించేవాళ్ళు. టెక్నాలజీ పెరిగిన తరువాత వర్చువల్ విధానంలో ఇంటర్వ్యూలు చేయడం మొదలైంది. ఈ విధానం ద్వారా ఇంటర్వ్యూలు జరిపితే.. కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. కాబట్టి వర్చువల్ విధానంలో జరిగే ఇంటర్వ్యూలపై గూగుల్ సీఈఓ కీలక వ్యాఖ్యలు చేశారు.

వర్చువల్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంటే అభ్యర్థులు కొందరు మోసం చేస్తున్నారు. ఇలాంటి వాటిని నివారించడానికే గూగుల్ కంపెనీలో మళ్ళీ వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు 'సుందర్ పిచాయ్' పేర్కొన్నారు. ఏఐ వినియోగం పెరుగుతున్నందున వర్చువల్ ఇంటర్వ్యూలు సమంజసం కాదని కంపెనీలోని ఉద్యోగులు కూడా డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. వర్చువల్ ఇంటర్వ్యూల ద్వారా.. ఇంటర్వ్యూలను షెడ్యూల్ చేయడం సులభం. అంతే కాకుండా శ్రమ, వ్యయం కూడా తగ్గుతాయి. అయితే కొందరు మోసం చేయడం మొదలు పెట్టారు. దీనిని దృష్టిలో ఉంచుకునే.. ఇంటర్వ్యూ చేయదలచిన అభ్యర్థిని, కనీసం ఒక్కసారైనా వ్యక్తిగతంగా ఇంటర్వ్యూ చేయాలని నిర్ణయించుకున్నట్లు సుందర్ పిచాయ్ వెల్లడించారు.

ప్రస్తుతం ఈ సమస్య ఎదుర్కొంటున్న కంపెనీల జాబితాలో గూగుల్ మాత్రమే కాకుండా.. అమెజాన్, ఆంత్రోపిక్ , సిస్కో, మెకిన్సే వంటి కంపెనీలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం పరిస్థితులను చూస్తుంటే.. కంపెనీలన్నీ వర్చువల్ ఇంటర్వ్యూ విధానానికి మెల్లగా చరమగీతం పాడేసి, మళ్ళీ వ్యక్తిగత ఇంటర్వ్యూలకే ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంటుందని స్పష్టంగా తెలుస్తోంది.

## రుణగ్రహీతలకు ఎస్‌బీఐ షాక్.. హోమ్ లోన్‌పై వడ్డీరేట్ల పెంపు

**ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కస్టమర్లకు షాకిచ్చింది. గృహ రుణాలపై వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. కొత్త రుణ గ్రహీతలకు ఈ పెంపు వర్తిస్తుందని తెలిపింది. సవరించిన వడ్డీరేట్లు ఆగస్టు 1 నుంచే అమల్లోకి వచ్చినట్లు వెల్లడించింది.**

కాల వ్యవధిని బట్టి ఈ గృహ రుణాల వడ్డీరేట్లలో వ్యత్యాసం ఉంటుంది. అయితే, ఈ రేట్ల గరిష్ఠ పరిమితిని ఇప్పుడు ఎస్‌బీఐ పెంచేసింది. ఇప్పటివరకు ఈ బ్యాంకులో గృహ రుణ రేట్లు 7.50శాతం నుంచి 8.45శాతంగా ఉండగా.. తాజా నిర్ణయంతో ఇది 7.50శాతం నుంచి 8.70 శాతానికి పెరిగింది. అంటే తక్కువ సిబిల్ స్కోరు ఉండేవారికి ఇకపై అధిక వడ్డీరేట్లకు గృహ రుణాలు అందించనుంది. "సిబిల్ స్కోరు, ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు ఆధారంగా విధించే వడ్డీరేట్లలో ఎస్‌బీఐ మార్పులు చేసింది. గృహ రుణాలపై మార్జిన్ పెంచుకునేందుకే వడ్డీరేట్లను పెంచాం. అయితే, ఈ పెంపు కేవలం కొత్త కస్టమర్లకు మాత్రమే. ఇప్పటికే తీసుకున్న గృహరుణాలకు ఇది వర్తించదు" అని బ్యాంకు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కాగా.. దీనిపై ఎస్‌బీఐ నుంచి అధికారిక ప్రకటన రాలేదు.మరో ప్రభుత్వ రంగ బ్యాంకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా తమ గృహరుణాలపై వడ్డీరేట్లను సవరించింది. గతంలో 7.35శాతం ఉండగా.. ఇప్పుడు దాన్ని 10 బేసిస్ పాయింట్లు పెంచి 7.45శాతానికి తీసుకొచ్చింది. ఎస్‌బీఐ నిర్ణయంతో మిగతా ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు కూడా హోమ్ లోన్‌పై వడ్డీరేట్లను పెంచే అవకాశం ఉంది.






# 59 ఏళ్ల వయసులో ఇంత ఫిట్‌గా.. ఈ ఫేమస్ నటి ఎవరో గుర్తుపట్టారా?



పైన కనిపిస్తున్న నటి వయసు 59. ఈ ఏజ్‌లో కూడా ఆమె జిమ్‌లో చెమటలు చిందిస్తోంది. చిన్నపాటి వ్యాయామాలే కాకుండా డంబుల్స్ ఎత్తుతూ కష్టమైన వర్కవుట్స్ కూడా అవలీలగా చేస్తోంది. ఇంతకీ ఆ ఫేమస్ నటి ఎవరో గుర్తుపట్టారా? తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో అనేక సినిమాలు చేసింది. సౌత్ ఇండస్ట్రీకి బాగా పరిచయమున్న పేరు. ఆవిడే నదియా .. ఇప్పటికీ అందంగా, ఫిట్‌గా కనిపించే ఆమె వర్కవుట్స్ చేస్తున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇది చూసిన అభిమానులు మీరు చాలా గ్రేట్ అంటూ కామెంట్లు చేస్తున్నారు.

సినిమా

1984లో వచ్చిన నూకెత్త దూరతు కన్నుం నట్టు అనే మలయాళ చిత్రంతో వెండితెరపై ఎంట్రీ ఇచ్చింది. మొదటి సినిమాకే ఉత్తమనటిగా ఫిలింఫేర్ అవార్డు అందుకుంది. ఎన్నో సినిమాల్లో హీరోయిన్‌గా నటించిన ఆమె సెకండ్ ఇన్నింగ్స్‌లో అమ్మ, అత్త పాత్రలతో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారింది. తెలుగులో.. అత్తారింటికి దారేది, దృశ్యం, దృశ్యం 2, నా పేరు సూర్య, అఆ, అంటే సుందరానికి వంటి పలు చిత్రాల్లో నటించింది.



# బరువు తగ్గాను.. మళ్లీ కథలు వింటున్నా: కీర్తి సురేష్

**తక్కువ కాలంలోనే ఎక్కువ పేరు తెచ్చుకొని స్టార్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న నటి కీర్తిసురేష్. మలయాళంలో బాల తారగా కెరీర్ ప్రారంభించిన ఈ కేరళ కుట్టి, ఆ తర్వాత కథానాయకిగా అవతారమెత్తి మలయాళం, తమిళం, తెలుగు, హిందీ భాషల్లో నటించి పాన్ ఇండియా కథానాయకిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా మహానటి చిత్రంలో దివంగత నటి సావిత్రి పాత్రలో జీవించి జాతీయ ఉత్తమనటి అవార్డును గెలుచుకున్నారు. అదేవిధంగా తక్కువ కాలంలోనే ఉమెన్ సెంట్రిక్ కథా చిత్రాల్లో నటించి పేరు తెచ్చుకున్నారు.**

ఇకపోతే కథానాయకిగా బిజీగా ఉన్న సమయంలోనే తన బాల్య స్నేహితుడిని పెళ్లి చేసుకుని సంసార జీవితంలోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం ఈమె చేతిలో రివాల్వర్ రీటా, కన్నివెడి చిత్రాలు ఉన్నాయి. అయితే వివాహానంతరం కీర్తిసురేష్ కొత్త చిత్రాలకు కమిట్ కాలేదు. అయినా ఖాళీగా లేరు. వాణిజ్య ప్రకటనల్లో నటిస్తూ బిజీగానే ఉన్నారు. అదేవిధంగా సామాజిక మాధ్యమాల్లోనూ చాలా యాక్టివ్‌గా ఉంటున్నారు.

కాగా వివాహానంతరం ఈ అమ్మడు కాస్త బరువెక్కారనే కామెంట్స్‌ను ఎదుర్కొన్నారు. అలాంటి కామెంట్స్‌పై స్పందించిన కీర్తిసురేష్ పెళ్లి తర్వాత బరువు పెరిగిన విషయం నిజమేనన్నారు.. అయితే బరువు తగ్గడానికి కార్డియో కసరత్తులు చేసి స్లిమ్‌గా మారడానికి పోరాడానన్నారు. వారానికి 300 నిమిషాలు ప్రకారం ఎక్సర్‌సైజ్ చేసి ఇప్పుడు 9 కిలోల బరువు తగ్గినట్లు చెప్పారు. తీవ్ర ప్రయత్నం, ఆహారపు కట్టుబాట్లు కలిస్తే ఫలితం సాధ్యమేనని కీర్తి పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం నూతన చిత్రాలకు సంబంధించిన కథలు వింటున్నానని, త్వరలోనే వాటికి సంబంధించిన వివరాలను ప్రకటిస్తానని ఆమె తెలిపారు.



# పిల్లనగ్రోవితో మ్యాజిక్ చేసిన హీరోయిన్.. వీడియో వైరల్

కృష్ణాష్టమి అనగానే అందరూ రాధ, గోపికలుగా తయారై తెగ సందడి చేశారు. హీరోయిన్ అదా శర్మ కూడా అందంగా ముస్తాబైంది. అయితే చేతిలో వేణువు పట్టుకుంది. ఊరికే ఫోటో కోసమే అలా స్టిల్ ఇచ్చిందనుకునేరు. కానే కాదు, ఫ్లూట్‌తో అద్భుతంగా ఓ పాట ట్యూన్ వినిపించింది. ఇది చూసిన అభిమానులు.. మీరు మల్టీటాలెంటెడ్ అని మెచ్చుకుంటున్నారు. కాగా అదా శర్మ.. లాక్‌డౌన్‌లో ఫ్లూట్ నేర్చుకుంది.

సినిమాల విషయానికి వస్తే..

అదా శర్మ.. 1920 అనే హారర్ చిత్రంతో వెండితెరపై ఎంట్రీ ఇచ్చింది. హార్ట్ ఎటాక్ మూవీతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. తెలుగులో సుబ్రహ్మణ్యం ఫర్ సేల్, గరం, క్షణం, కల్కి, సీ.డీ: క్రిమినల్ ఆర్ డెవిల్ వంటి చిత్రాల్లో నటించింది. ద కేరళ స్టోరీ మూవీతో సెన్సేషన్ అయిన అదా చివరగా తుమ్‌కో మేరీ కసమ్ మూవీలో కనిపించింది.

# తనే నా నిజమైన హీరో.. మేకప్ నచ్చదనడంతో ట్రోలింగ్

**పెద్దగా ప్రచారంలోకి రాని ముఖమే అయినా, తెరపై కనిపించినప్పుడల్లా చూపు తిప్పకోలేనంతగా ఆకట్టుకునే నటి నిమిషా సజయన్ . ప్రస్తుతం బలమైన పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఆమె గురించి ఆసక్తికర విషయాలు మీకోసం..**



**బ్లాక్‌బెల్ట్**

నిమిషా తండ్రి సజయన్, తల్లి అనంతవల్లి ఇద్దరూ కేరళ వాసులే అయినా, కుటుంబం ముంబైలో స్థిరపడింది. ఆమె బాల్యం ముంబై వీధుల్లో గడిచింది. అందుకే 'ఆ నగరాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అంటుందామె. నిమిషా తైక్వాండోలో నిపుణురాలు. బాల్యంలోనే బ్లాక్‌బెల్ట్ సాధించింది. పాఠశాల నుంచే ఫుట్‌బాల్, వాలీబాల్ బృందాలకు నాయకత్వం వహించింది. యోధురాలిగా ఎదిగిన ఆమె, తెరపై మార్దవానికి నిర్వచనంగా మారింది.

**మేకప్ నచ్చదు**

నటన విషయంలో పైపైమెరుపుల కంటే అభినయమే అవసరం అన్నది నిమిషా అభిప్రాయం. అందుకే ఆమె చేసిన చిత్రాల్లో గ్లామర్‌కు చోటు తక్కువ. 'ఒరు కుప్రసిద్ధ పయ్యన్', 'చోళ' చిత్రాలకు ఉత్తమ నటి అవార్డులు అందుకుంది. 'నాకు మేకప్ నచ్చదు, అవసరమైతే పాత్ర కోసమే మేకప్ చేసుకుంటాను' అన్న ఆమె వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తాయి.

**అప్పటికప్పుడు వంట నేర్చుకుని..**

కానీ తను వెంటనే స్పందించి, 'వ్యక్తిగత అభిరుచి వేరు, నటనా బాధ్యత వేరు' అంటూ వివాదాన్ని ముగించింది. ఓ సినిమా సెట్లో వంటవాడి దగ్గర పరోటా చేయడం నేర్చుకుని, స్పాట్‌లో స్వయంగా పరోటా చేసి పెట్టిన సంఘటన తెర వెనక ముచ్చటగా మారి వైరల్ అయింది. చిన్నతనంలో ఇంటి ఆవరణలో నీళ్లు పోస్తున్నట్లు నటించి, తండ్రిపై నీళ్లు చల్లడమే తన మొదటి నటన అని గుర్తు చేసుకుంటుంది.


**GST చెల్లించలేదని ఆరోపణలు**

ఆమెపై వేసిన పన్నుల వివాదం అప్పట్లో పెద్ద దుమారమే రేపింది. ముప్పై లక్షల జీఎస్‌టీ చెల్లించలేదన్న ఆరోపణలపై ఆమె తల్లి ప్రత్యక్షంగా స్పందించి ఆధారాలతో సహా ఖండించారు. 'అక్కడ నా తల్లే నిజమైన హీరో' అని నిమిషా చెప్పింది. చిత్రలేఖనంతో పాటు ఫొటోగ్రఫీలోనూ నిమిషా ప్రతిభావంతురాలే! ఈ రెండూ ఆమెకు ఇష్టమైన వ్యాపకాలు. సంప్రదాయ వంటలు అంటే ప్రాణం. పాల పాయసం, చేపల వంటలు, సధ్యా లేకుండా ఏ పండుగ తనకు అసలైన పండుగలా అనిపించదట.

**రంగు అడ్డు కాదు**

కొందరు రంగుపై వివక్ష చూపుతూ 'ఇలాగుంటే పాత్రలు రావు'అని విమర్శించినా, నిమిషా మాత్రం 'ప్రతిభ ఉన్న చోట రంగు అడ్డుకాదు' అన్న నమ్మకంతో ముందుకు సాగుతోంది. ఆమె ఛాతీపై ఉన్న సూర్యచక్రపు గుర్తు తన ఆత్మవిశ్వాసానికి ప్రతీక. 'ఎప్పుడూ కొత్తగా ఆలోచించాలి, సృజనాత్మకంగా ఉండాలి' అని నమ్ముతుంది. ఈమె చివరగా DNA సినిమాలో కనిపించింది.





# నేనే హీరో.. కానీ ఆ మూవీ శ్రీదేవి వల్లే హిట్ అయింది

**'కూలీ' సినిమాతో ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన నాగార్జున.. తొలిసారి విలన్‌గా చేసి ఆకట్టుకున్నాడు. రెండు నెలల క్రితం 'కుబేర'లో వైవిధ్యమైన సహాయ పాత్రలో కనిపించి మెప్పించాడు. అయితే ఇప్పుడంటే నాగ్ వెంటపడి దర్శకులు సినిమాలు తీస్తున్నారు. కానీ స్వయంగా నాగార్జున.. డైరెక్టర్ మణిరత్నం వెంటపడి ఓ సినిమా చేశారని మీలో ఎందరికీ తెలుసు. అవును ఆ సంగతులు నాగ్ ఇప్పుడు బయటపెట్టాడు.**

జగపతిబాబు హోస్ట్‌గా ఓ టాక్ షో ప్రారంభమైంది. అందులో నాగార్జున తొలి గెస్ట్‌గా వచ్చాడు. ఈ క్రమంలోనే ఎన్నో సంగతులు పంచుకున్న నాగ్.. తన యాక్టింగ్ కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చారు. మణిరత్నం వెంటపడి 'గీతాంజలి' సినిమా చేసిన అనుభవం గురించి బయటపెట్టారు.

'నేను చేసిన ప్రారంభ సినిమాలని నాగేశ్వరరావు అబ్బాయి అనే ఉద్దేశంతోనే ప్రేక్షకులు చూశారు. కొందరికి నా యాక్టింగ్ నచ్చితే మరికొందరికి నచ్చలేదు. తర్వాత కూడా ఆరేడు మూవీస్ చేశా. అలా 'మజ్ను' నాకు బ్రేక్ ఇచ్చింది. కమర్షియల్ చిత్రాల్లో అయితే 'ఆఖరి పోరాటం' హిట్ అయింది. అయితే అందులో నేను బొమ్మలా ఉన్నానంతే. డైరెక్టర్ రాఘవేంద్రరావు, హీరోయిన్ శ్రీదేవి వల్ల మూవీ సక్సెస్ అయింది'

'మణిరత్నం తీసిన 'మౌనరాగం' సినిమా నాకు బాగా నచ్చింది. దీంతో ఆయనతో ఎలాగైనా సినిమా చేయాలని అనుకున్నాను. ఆయన వాకింగ్‌కి వెళ్లే పార్క్ వివరాలు తెలుసుకుని, దాదాపు నెలరోజులు ఆయన వెంటపడ్డాను. పది నిమిషాలు కలిసి నడిచిన తర్వాత ఆయన టెన్నిస్ ఆడేందుకు వెళ్లిపోయారు. చివరకు ఎలాగోలా ఒప్పించాను. అలా 'గీతాంజలి' మూవీ వచ్చింది. దాన్ని తమిళంలోనే తీయాలనుకున్నారు. కానీ తెలుగు మార్కెట్ కూడా పెంచుకోండి అని సలహా ఇవ్వడంతో నాతో సినిమాకి ఒప్పుకొన్నారు. అనుకున్నట్లే హిట్ అయింది' అని నాగార్జున చెప్పుకొచ్చారు.

# ఓటీటీలోకి కామెడీ థ్రిల్లర్.. ఫహాద్ ఫాజిల్ మూవీ స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

ఓటీటీ ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు మరో సినిమా సిద్ధమైంది. 'నెట్‌ఫ్లిక్స్' వేదికగా ఈ నెల 22 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ ఆడియోతో అలరించనుంది. అదే 'మారీశన్' . ఫహాద్ ఫాజిల్, వడివేలు ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం ఇది. సుదీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా జులైలో బాక్సాఫీసు వద్ద సందడి చేసింది.

దయాలన్ (ఫహాద్) ఓ దొంగ. అల్జీమర్స్‌తో బాధపడుతున్న వేలాయుధం పిళ్లై (వడివేలు) వద్ద చాలా డబ్బు ఉందని తెలుసుకుంటాడు. స్నేహితుడిని కలిసేందుకు వేలాయుధం ఊరు బయలుదేరగా.. చోరీ చేసేందుకు అదే సరైన సమయమని ఫిక్స్ అవుతాడు. మాటలతో వేలాయుధాన్ని ముగ్గులోకి దింపి, తన బైక్‌పైనే వెళ్లేలా చేస్తాడు. ఆ ప్రయాణంలో ఏం జరిగింది? తాను అనుకున్నట్టే దయాలన్ దోచుకున్నాడా? వేలాయుధం పరిస్థితి తెలుసుకుని వదిలేశాడా? అన్నది ఈ సినిమాలో కీలకాంశం.



# గంభీర్ ఇలాకా.. ఫిక్స్‌డ్ ఫినిషర్లు ఉండరు!



భారత క్రికెట్‌లో ప్రయోగాలు చేయడంలో గౌతమ్ గంభీర్ కోచ్‌గా వచ్చాక ఎక్కువనే చెప్పాలి. అందులో భాగంగా కొన్నిసార్లు ఫలితాలు ప్రతికూలంగా వచ్చినా వాటినుంచి వెనక్కి మళ్లడు. గత ఇంగ్లాండ్ పర్యటనలోనే అతడి ప్రణాళికలు ఏంటో చూశాం. ఇప్పుడు టీ20ల్లోనూ అదే పంథాను అనుసరించేందుకు సిద్ధమవుతున్నట్లు కథనాలు వస్తున్నాయి.

**స్పెషలిస్టులతో..**

''భారత క్రికెట్‌లో ప్రస్తుతం చర్చ సాగుతోన్న అంశం గంభీర్ ఆల్‌ఫార్మాట్ కెప్టెన్ వైపు మొగ్గు చూపిస్తాడు. తన విజన్‌పై ఎప్పుడూ స్పష్టతతోఉంటాడు. టీ20 జట్టులో మార్పు చేసేందుకు సిద్ధమవుతున్నాడు. కాలంతోపాటు పొట్టి ఫార్మాట్‌లోకి వేగంగా మారిపోవడం లేదనే అపవాదు టీమ్ఇండియాపై ఉంది. దానిని తొలగించేందుకు టీ20 స్పెషలిస్టులుగా ముద్రపడిన ఆటగాళ్లతో పరిష్కరించాలని గంభీర్ భావిస్తున్నాడు. అందుకు శివమ్ దూబెనే ఉదాహరణగా తీసుకుంటే.. కేవలం ఫినిషర్‌గా మాత్రమే అతడిని పరిగణించకుండా ఏ పాత్ర పోషించాలని సూచిస్తే దానిని పాటించాల్సింది. ఇక్కడ సౌకర్యం అని ఎవరూ భావించకూడదు. ప్రతి పాత్రకు న్యాయం చేయాల్సిందే. మోడర్న్ టీ20 క్రికెట్‌లో నైపుణ్యమే కీలకం. బ్యాటింగ్ ఆర్డర్‌లో నంబర్లు చూసేదేలేదు. దూబె గతంలో మిడిలార్డర్‌లో వచ్చి బౌలర్లపై విరుచుకుపడేవాడు. కానీ, అతడి అవసరం ముందు ఉందనుకుంటే టాప్ ఆర్డర్‌లోనూ ఆడాలి. ఇక్కడ ఎవరూ ప్రత్యేకంగా 'ఫినిషర్లు' అని ఉండరు. అవసరమైనప్పుడు అందరూ పరుగులు చేయాలి'' అని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.

**ఒకే కెప్టెన్ కిందకు..**

ప్రస్తుతం టెస్టు జట్టుకు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహిస్తున్నాడు. మరోవైపు రోహిత్ శర్మ వన్డే సారథిగా ఉన్నాడు. ఇక సూర్యకుమార్ యాదవ్ టీ20లకు కెప్టెన్‌గా ఉన్న సంగతి తెలిసిందే. భవిష్యత్తులో మూడు ఫార్మాట్లకు ఒకరే సారథిగా ఉండే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాది టీ20 ప్రపంచ కప్, ఆపై సంవత్సరం వన్డే వరల్డ్ కప్‌లు ఉన్నాయి. మరికొద్ది రోజుల్లో ఆసియా కప్ జరగనుంది. ఈ క్రమంలో ఎప్పుడు నిర్ణయం తీసుకుంటారనేది క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మూడింటి పగ్గాలను గిల్‌కే అప్పగిస్తారన్న ప్రచారమూ ఉంది.



## నా బ్యాటింగ్ ఆర్డర్‌పైనా ఏడ్చేసేవాడు: ఓ క్రికెటర్‌పై ఇర్ఫాన్ పఠాన్ కామెంట్స్

పేస్ బౌలర్‌గా జట్టులోకి వచ్చిన ఇర్ఫాన్ పఠాన్ లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌తో విలువైన పరుగులు రాబట్టాడు. ఆ తర్వాత కెప్టెన్, మేనేజ్‌మెంట్ సూచన మేరకు వన్డేల్లో తన బ్యాటింగ్ ఆర్డర్ మార్చుకున్నాడు. ఏకంగా వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగి కీలక ఇన్నింగ్స్‌లూ ఆడాడు. ఆ సమయంలో ఓ క్రికెటర్ నుంచి తీవ్ర స్పందన ఎదురైందని.. తన బ్యాటింగ్ ఆర్డర్‌పై ఫిర్యాదులు చేసినట్లు తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఇర్ఫాన్ పఠాన్ వెల్లడించాడు. అయితే, అతడు ఎవరనేది మాత్రం చెప్పకపోవడం గమనార్హం.

''అప్పుడు నేను కుర్రాడినే. ఆ సమయంలో నాకంటే 'అతడే' మంచి బ్యాటర్ అని భావించేవాడు. ఇక్కడ పేర్లు చెప్పడం వల్ల వారిని అగౌరవపరిచినట్లు అవుతుంది. క్రికెట్‌లో ఎప్పుడూ శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరు. డ్రెస్సింగ్‌రూమ్‌లో ఓసారి 'నాకంటే ముందు ఎందుకు పఠాన్‌ను బ్యాటింగ్‌కు పంపారు?' అని అడిగాడు. మరి ఆ బ్యాటర్ ఎవరు అని చాలా మంది అడుగుతారు. కానీ, నేను పేరు చెప్పలేను. దాదా (గంగూలీ) కాదు. అసలు గంగూలీ ఇతరుల కోసం తన ప్లేస్‌ను ఇచ్చిన సందర్భాలూ ఉన్నాయి. అలాగే రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్, వీవీఎస్ లక్ష్మణ్, సచిన్.. ఎవరూ కాదు. నాకంటే అతడికే ఎక్కువ సత్తా ఉందని నమ్మేవాడు. అప్పటి కెప్టెన్ కూడా అతడి మాటనే విని ప్రమోట్ చేశాడు. కానీ, ఆ మ్యాచ్‌లో చాలా త్వరగా పెవిలియన్‌కు చేరాడు'' అని పఠాన్ గుర్తు చేసుకున్నాడు.

**దులీప్ ట్రోఫీలో సచిన్ పంపాడు**

''దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో నన్ను సచిన్ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపాడు. అనిల్ కుంబ్లే బౌలింగ్‌కు వచ్చినప్పుడు కౌంటర్ ఎటాక్ చేయమని సూచించాడు. కుంబ్లే వంటి మ్యాచ్ విన్నర్‌తో ఇబ్బందులు ఉంటాయని వివరించాడు. అదే నేను ఎనిమిదో స్థానంలో వచ్చి కొన్ని షాట్లు కొడితే అనిల్ వెంటనే తన ప్రణాళికలు మార్చేస్తాడని సచిన్‌కు తెలుసు. అందుకే, నన్ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపాడు'' అని పఠాన్ వెల్లడించాడు.



## ఓపెన్ బరిలో దివ్య

**స్విస్ గ్రాండ్ చెస్**

**దిల్లీ:** భారత యువ చెస్ సంచలనం దివ్య దేశ్‌ముఖ్ ఫిడే స్విస్ గ్రాండ్ టోర్నీలో పోటీపడబోతోంది. ఇటీవల ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన తర్వాత స్పీడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో ఆడి క్వార్టర్స్‌లోనే ఓడిన దివ్య.. స్విస్ టోర్నీలో ఓపెన్ విభాగంలో బరిలో దిగనుంది. సెప్టెంబర్ 3న ఆరంభమయ్యే ఈ టోర్నీలో దివ్యతో పాటు రష్యా అమ్మాయి అలెగ్జాండ్రా గొర్యాచ్‌కినాకు వైల్డ్‌కార్డ్ ఎంట్రీ దక్కింది. ఇదే కేటగిరిలో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్, అర్జున్ ఇరిగేశి, ప్రజ్ఞానంద, విదిత్, పెంటేల హరికృష్ణ, నిహాల్ సరీన్ కూడా ఆడుతున్నారు. స్విస్ టోర్నీ మహిళల విభాగంలో ప్రపంచకప్ రన్నరప్ కోనేరు హంపి, వైశాలి పోటీలో ఉన్నారు. ''యువ క్రీడాకారిణులు ఎక్కువమంది ఓపెన్ టోర్నీల్లో ఆడాలి. పురుషులతో పోటీపడాలి. మహిళా టోర్నీల మీద మాత్రమే దృష్టి సారించకూడదు'' అని ఇటీవల స్టార్ ప్లేయర్ తానియా సచ్‌దేవ్ పేర్కొంది.

# టీమిండియాకు గుడ్ న్యూస్.. ప్రత్యర్థులకు బ్యాడ్ న్యూస్

**ఆసియాకప్-2025కు ముందు టీమిండియాకు ఓ అదిరిపోయే వార్త అందింది. స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఆసియాకప్‌లో ఆడేందుకు సిద్ధంగా ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే బుమ్రా తన నిర్ణయాన్ని సెలక్టర్లు తెలియజేసినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తమ కథనంలో పేర్కొంది.**



ఆండర్సన్‌టెండూల్కర్ ట్రోఫీలో తలపడేందుకు ఇంగ్లండ్‌కు వెళ్లిన బుమ్రా కేవలం మూడు మ్యాచ్‌ల మాత్రమే ఆడాడు. ఆ తర్వాత ఆఖరి టెస్టుకు ముందు బుమ్రాను జట్టు నుంచి బీసీసీఐ రిలీజ్ చేసింది. మూడు మ్యాచ్‌లలో బుమ్రా తన ప్రదర్శనతో ఆకట్టుకున్నప్పటికి ఫిట్‌నెస్ పరంగా మాత్రం కాస్త ఇబ్బంది పడుతూ కన్పించాడు.

దీంతో అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌ను దృష్టిలో పెట్టుకుని బుమ్రాకు సెలక్టర్లు విశ్రాంతి ఇస్తారని వార్తలు వినిపించాయి. కానీ ఆసియాకప్‌కు ముందు దాదాపు ఏభై రోజులు విశ్రాంతి లభించడంతో బుమ్రా తిరిగి టీ20 ఫార్మాట్‌లో ఆడేందుకు సిద్ధమయ్యాడు.

"ఆసియా కప్ జట్టు ఎంపికకు తాను అందుబాటులో ఉంటానని బుమ్రా బుమ్రా సెలెక్టర్లకు తెలియజేశాడు. వచ్చే వారం జరిగే సమావేశంలో సెలక్షన్ కమిటీ ఈ విషయంపై చర్చించనున్నారని" ఓ బీసీసీఐ అధికారి పేర్కొన్నారు. బుమ్రా చివరగా టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ తరపున పొట్టి క్రికెట్‌లో ఆడాడు. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ ఏడు పరుగుల తేడాతో గెలిచింది. ఈ స్పీడ్ స్టార్ కేవలం 18 పరుగులిచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టాడు.

**ఆసియాకప్-2025కు భారత జట్టు(అంచనా)**

**సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, అక్షర్ పటేల్, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా, జితేశ్ శర్మ**

# ఆసియాకప్ రేసులో గిల్ కంటే అతడే ముందున్నాడు: అశ్విన్

ఆసియాకప్2025 టీ20 టోర్నీ సెప్టెంబర్ 9 నుంచి యూఏఈ వేదికగా ప్రారంభం కానుంది. ఈ మార్క్యూ ఈవెంట్ కోసం భారత జట్టును అజిత్ అగర్కార్ నేతృత్వంలోని బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఒక ట్రెండు రోజుల్లో ప్రకటించే అవకాశముంది.

అయితే ఈ టోర్నీకి భారత జట్టులో యవ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు చోటు ఇవ్వాలని లెజెండరీ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ సూచించాడు. కాగా టీమిండియా హెడ్‌కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టాక టీ20 ఫార్మాట్‌లో ఓపెనర్లగా అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ కొనసాగుతున్నారు.

చాలా టీ20 మ్యాచ్‌లకు జైశ్వాల్‌కు విశ్రాంతి ఇచ్చారు. ఇప్పుడు ఆసియాకప్‌నకు జైశ్వాల్‌తో పాటు మరో ఓపెనర్ శుబ్‌మన్ గిల్ కూడా ఉన్నాడు. దీంతో భారత జట్టులో ఎవరికి చోటు దక్కుతుందన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.



"ఆసియాకప్ జట్టు ఎంపిక గురించి కొన్ని చర్చలు జరుగుతున్నాయి. టీ20 ప్రపంచకప్‌లో యశస్వి జైస్వాల్ బ్యాకప్ ఓపెనర్‌గా ఉన్నందున, శుబ్‌మన్ గిల్‌ను టీ20 ప్రణాళికలకు సరిపోతాడా లేదా అన్నది ఇప్పుడు అందరి మనస్సులను తొలుస్తున్న ప్రశ్న. నావరకు అయితే సెలక్టర్లు గిల్ కంటే జైశ్వాల్‌కే తొలి ప్రాధాన్యత ఇస్తారని అనుకుంటున్నాను. రోహిత్ శర్మ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించడంతో ఆ స్థానంలో జైశ్వాల్ ఆటోమేటిక్‌గా లభిస్తుంది. అభిషేక్ శర్మ స్థానానికి ఎటువంటి ఢోకా లేదు.

ఇప్పుడంతా మరో ఓపెనర్ కోసమే చర్చ. శుబ్‌మన్ గిల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అదేవిధంగా సంజూ శాంసన్ కూడా ఓపెనర్‌గా అద్భుతంగా రాణించాడు. కాబట్టి సెలెక్టర్లకు కష్టమైన పరిస్థితి" అని ఎక్స్‌ప్రెస్ స్పోర్ట్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అశ్విన్ పేర్కొన్నాడు.



# స్టార్క్ భార్య సుడిగాలి శతకం.. మూడో వన్డేలో టీమిండియా ఓటమి

**ఆస్ట్రేలియా ఏ మహిళల జట్టుతో జరిగిన నామమాత్రపు మూడో వన్డేలో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. అయితే ఈ గెలుపు ఆసీస్‌కు కంటితుడుపుగా మాత్రమే పనికొస్తుంది. ఎందుకంటే మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ను భారత్ ఇదివరకే కైవసం చేసుకుంది (తొలి రెండు వన్డేలు గెలిచి).**

మూడో వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ తడబడింది. ఆసీస్ బౌలర్లు తహ్లియా మెక్‌గ్రాత్ (80 403), అనిక లియారాయ్డ్ (30162), ఎల్లా హేవర్డ్ (100402), సియన్నా జింజర్ (8.40502), లూసీ హ్యామిల్టన్ (102341) సత్తా చాటడంతో 47.4 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌటైంది. షెఫాలీ వర్మ (52), యస్తికా భాటియా (42) పోరాటపటిమ కనబర్చి భారత్‌కు ఈ మాత్రం స్కోరైన అందించారు.

వీరు మినహా టీమిండియాలో ఎవరూ రాణించలేదు. నందిని కశ్యప్ (28), రఘవి బిస్త్ (18), తనుశ్రీ సర్కార్ (17), కెప్టెన్ రాధా యాదవ్ (18), తనుజా కన్వర్ (15) రెండంకెల స్కోర్లు చేయగా.. తేజల్ హసబ్నిస్ (1), మిన్నూ మణి (5), సైమా ఠాకోర్ (0), షబ్నమ్ షకీల్ (7 నాటౌట్) సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు.

అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఆసీస్ సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్ అలిస్సా హీలీ (మిచెల్ స్టార్క్ భార్య) (84 బంతుల్లో 137 నాటౌట్; 23 ఫోర్లు, 3 సిక్సర్లు) సుడిగాలి శతకంతో ఆసీస్‌ను విజయతీరాలకు చేర్చింది. ఆమెకు మరో ఓపెనర్ తహ్లియా విల్సన్ (59), రేచల్ ట్రెనామన్ (21 నాటౌట్) సహకరించారు.

ఈ మ్యాచ్‌లో ఓడినా భారత్ 21 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. దీనికి ముందు ఇరు జట్ల మధ్య జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఆసీస్ 30 తేడాతో గెలుచుకుంది. టీ20ల్లో ఎదురైన పరాభవానికి భారత్ వన్డేల్లో ప్రతీకారం తీర్చుకుంది. ఇరు జట్ల మధ్య ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆగస్ట్ 21 నుంచి ప్రారంభం కానుంది. ఈ మల్టీ ఫార్మాట్ సిరీస్ కోసం భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటిస్తుంది.